క్లుప్తంగా

మావోయిస్టుల సమాచారమిస్తే బహుమతి

కరకగూడెం: మావోయిస్టుల సమాచారం పోలీసులకు ఇస్తే బహుమతి ఇవ్వనున్నట్లు కరకగూడెం ఎస్సై రాజేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి నిషేధిత మావోయిస్టు యాక్షన్ టీం సభ్యుల పోస్టర్లను జన సముదాయ ప్రదేశాల్లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మావోయిస్టులు అభివృద్ధి నిరోధకులని, వారి సమాచారం ఇస్తే వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. అంతేకాకుండా మావోయిస్టు వ్యవస్థను నిర్మూలించి బంగారు భవితను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి హామీ’ని కాపాడుకుందాం..

దుమ్ముగూడెం: ఉద్యమాలతోనే ఉపాధి హామీని కాపాడుకుందామని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.రామకృష్ణ పిలుపు ఇచ్చారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని ఉపాధి హామీ పని ప్రాంతాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా తూరుబాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీల పనులను పరిశీలించి, కూలీల సమస్యలపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం కూలీల పట్ల, శ్రమజీవుల పట్ల నిర్లక్ష్యం వహిస్తుంది అని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు 700 రూపాయలు ఇవ్వాలని, వారానికి ఒకసారి మాస్టర్ ప్లే సిప్పులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ భద్రచలం డివిజన్ ఏరియా కార్యదర్శి కొండా చరణ్, దాసరి సాయన్న,ఉపాధి కార్మికులు మోతుకూరి రామక్క జక్కులు వీరన్న మోతుకూరి ఏసు మని గుమ్మడి ప్రేమ్ కుమార్, గొల్ల రవీంద్ర పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడి మృతి

చండ్రుగొండ: సీపీఐ జిల్లా నాయకుడు యండి.ఖాజామోయినొద్దిన్ (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఒక కూతురు ఉన్నారు. సాయుధ తెలంగాణ రైతు పోరాటంలో, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాల్లో ఆయన చురుకైన పాత్ర పోషించారు. నిన్నమొన్నటి వరకు ఈ ప్రాంత రైతు, కూలీల సమస్యలపై ఖాజా అలుపెరుగని పోరాటాలు చేశారనే పేరుంది. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాష, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, సీపీఐ నాయకులు గార్లపాటి రామనాథం, బొర్రా కేశవులు, ఊకే నారాయణ, కనకం ఆంజనేయులు, సత్యనారాయణ, మల్లేష్, ఖాజా భౌతికగాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విచారణ చేయాలి

చర్ల: మండలంలోని గొంపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీల కష్టార్జితం సొమ్మును కాజేసిన వ్యవహారంపై తోణమే విచారణ జరిపించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని, కూలి డబ్బులను తిరిగి కూలీలకు ఇప్పించాలని సీపీఐ (ఎంఎల్)మాస్లైన్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఈదయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా కౌశిక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చెన్నం మోహన్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు వినతి

దమ్మపేట: గిరిజనుల పోడు భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆళ్లపల్లి మండల నాయకులు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ సందర్భంగా మండలంలోని గండుగులపల్లిలో మంగళవారం మంత్రిని కలిసి వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆళ్లపల్లి మండలంలో పోడు పట్టాలు పొందిన గిరిజనులకు విద్యుత్ సౌకర్యం కల్పించడమే కాక మండలానికి బస్సు సర్వీసులను పెరిగేలా చూడాలని కోరారు. దీంతో మంత్రి కలెక్టర్, ఆర్టీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారంపై సూచనలు చేశారు. మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, నాయకులు పాయం రామనర్సయ్య, వగ్గెల నారాయణ, ఎండి.హతహర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మంగళవారం పర్యటించారు. కాలికిగాయమై చికిత్స పొందుతున్న భగవాన్‌సింగ్‌కు ఆయన పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ కారం సుధీర్, అడపా నాగేశ్వరరావు, సురభి రాజేశ్, కృష్ణ, శేషగిరి, ఈర్ల రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే..

అశ్వాపురం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల పరిధిలోని పాములపల్లి గ్రామానికి చెందిన కుంజా రాజశేఖర్(28) మృతదేహానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అమరేందర్, కొర్సా దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

పక్కదారిలో పీడీఎస్ బియ్యం

- ములకపాడు కేంద్రంగా దందా
- పెరుగుతున్న భాగస్వాముల సంఖ్య
- దళారుల పాలవుతున్న పేదల బియ్యం



గతంలో పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం, వాహనం

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు కేంద్రంగా పీడీఎస్ బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ నిఘా పెట్టాల్సిన అధికారయంత్రాంగం చప్పుడు చేయకపోవడం విశేషం. ములకపాడుకు చెందిన ఓ వ్యాపారి ప్రతినెలా దాదాపు వందల క్వింటాల రేషన్ బియ్యాన్ని ఆంధ్రాలోని చట్టీ ప్రాంతానికి రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు నిఘా గుర్తించకపోవడం కొసమెరుపు.

మండలంలోని రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు అందిస్తున్న చౌక బియ్యాన్ని గ్రామాల్లో మనుషులను ఏర్పాటు చేసుకుని కేజీ రూ.10 కొనుగోలు చేసి వాటిని సుమారు రూ.20 విక్రయిస్తూ లక్షల రూపాయలను అక్రమంగా అర్జిస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడ్డప్పటికీ అధికారులు అటువంటి వారిపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టకపోవడం, ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రేషన్ దందా మరింత ముదిరింది. పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం మండలంలో పోలీస్ నిఘా 24 గంటలూ ఉంటుంది. కానీ నిఘాకు దొరకకుండా యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. రేషన్ బియ్యం రవాణా చేస్తూ గతంలో దొరికినప్పటికీ నామమాత్రపు కేసులు పెట్టడంతో వారికి భయం లేకుండా పోయింది. అయినప్పటికీ అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోకపోవడంతో రేషన్ బియ్యం దందా నిరాటంకంగా సాగుతుంది. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రతి నెలా డీలర్ల నుంచి కొంత, వినియోగదారుల నుంచి కొంత బియ్యాన్ని రేషన్ బియ్యం దందా దారులు కొనుగోలు చేస్తున్నారు.

అర్ధరాత్రి నుంచి యాక్షన్ షురూ..

రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యాపారు అర్ధరాత్రి తర్వాత యాక్షన్ ప్లాన్ షురూ చేసి తెల్లవారుజాము సమయానికి వాహనంలో బియ్యాన్ని కుంట, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. లబ్దిదారులు, కొన్ని రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసిన బియ్యాన్ని అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత అక్రమంగా తరలిస్తున్నారు. ములకపాడు టూ మారాయిగూడెం, అంజిపాక టూ మారాయిగూడెం రహదారిలోని కొన్ని ఆదివాసీ గ్రామాల్లో మండల వ్యాప్తంగా సేకరించిన బియ్యాన్ని స్టాకు పెట్టి అక్కడి నుంచే అటవీ ప్రాంత మార్గంలో వాహనం ద్వారా లక్ష్మీపురం మీదుగా కుంట వ్యాపారికి అందజేస్తున్నారు. మండలంలో పటిష్టమైన నిఘాను కలిగి ఉన్న పోలీస్‌శాఖ రేషన్ అక్రమ దందాపై దృష్టి పెట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. గతంలో లక్ష్మీనగరంలో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల బియ్యం, ములకపాడులోని ఓ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 139 క్వింటాళ్ల బియ్యం, 55 క్వింటాళ్ల నూకలు, టాటా మేజిక్‌లో తరలిస్తున్న 16 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఇప్పటికైనా అధికారులు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం అక్రమ దందాపై కొరడా ఝులిపించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం..

ఎలక్షన్ డ్యూటీలో బిజీగా ఉండటం వల్ల దృష్టి పెట్టలేక పోయాం. గతంలో ఉన్న కేసులను బేరీజు వేసుకుని ఈ సారి రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ దొరికితే పీడీ యాక్టు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– శ్రీరామ్, సివిల్ సప్లై ఆర్‌ఐ



విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో, ఎస్సై

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పలు విత్తనాల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అశ్వారావుపేటలోని పాత ఆంధ్రాబ్యాంక్ బజార్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, భద్రాచలం రోడ్, ఖమ్మం రోడ్, భగత్‌సింగ్ సెంటర్లలోగల పలు విత్తనాల, ఎరువుల దుకాణాల్లో స్థానిక వ్యవసాయ అధికారి నవీన్, ఎస్సై శ్రీరాముల శ్రీను ఆధ్వర్యంలో ఈ తనిఖీలను చేపట్టారు. ఆయా దుకాణాల్లో ఉన్న విత్తనాల, ఎరువుల వివరాలు, రైతులకు విక్రయించిన వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ దుకాణంలో ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, విత్తనాలు, ఎరువులను నిర్ణిత ధరలకే రైతులకు విక్రయించాలని అన్నారు. అలాగే దుకాణాల్లో ఉండే విత్తనాల స్టాక్ వివరాలను వ్యవసాయాధికారికి సమర్పించాలని ఆదేశించారు. రైతులకు తప్పనిసరిగా వాటికి సంబంధించిన బిల్లులను ఇవ్వాలని, వాటి వివరాలను నమోదు చేయాలని చెప్పారు. అదే విధంగా నకిలీ, లూజు విత్తనాలను విక్రయిస్తే తక్షణమే పోలీస్ స్టేషన్, వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని రైతులను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు.

మట్టి కుండలు చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో కటుకూరి భాగ్యలక్ష్మికి చెందిన 40 మట్టి కుండలను గుర్తు తెలియని దుండగులు దొంగిలించారు. బాధితురాలి కథనం ప్రకారం .. భాగ్యలక్ష్మి గత కొన్ని రోజుల క్రితం లక్ష్మీనగరం గ్రామంలోని స్టేట్ బ్యాంక్ దగ్గర్లో ఒక పూరిపాక ఏర్పాటు చేసుకుని వేసవి కాలంలో విక్రయించే మట్టితో తయారు చేసిన కుండలు, కూజాలు, డిబ్బీలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. కాగా రోజూలాగే కుండలు విక్రయించిన అనంతరం ఆదివారం రాత్రి దుకాణం బంద్ చేసి వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆ దుకాణంలోకి చొరబడి అందులోని 40 మట్టి కుండలను, డిబ్బీలను దొంగిలించారు. ఉదయం దుకాణం తీయడానికి రాగ అందులో ఉన్న కుండలు,డిబ్బీలు మాయం కావడంతో అవాక్కయింది. దొంగిలించిన వస్తువుల విలువ సుమారు రూ.8వేల వరకు ఉంటుందని బాధితురాలి బంధువులు తెలియచేశారు. చిరు వ్యాపారం పెట్టుకుని జీవిస్తున్న తన వస్తువులను దొంగిలించడంతో బాధితురాలు తీవ్ర ఆవేదన చెందుతోంది.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

మణుగూరుటౌన్: మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నారు. హైదరాబాద్ నుంచి మణుగూరు ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు మణుగూరు 4056 బస్సులో దిగి లాప్‌టాప్ బాగ్ మరిచిపోయాడు. చాలా సేపటి తర్వాత విషయాన్ని గుర్తించిన ప్రయాణికుడు టికెట్ ఆధారంగా డ్రైవర్ బన్సీలాల్‌కు ఫోన్‌లో సంప్రదించాడు. డ్రైవర్ బస్సులో బ్యాగును వెతికి ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు లాప్‌టాప్ బ్యాగ్ సదరు వ్యక్తికి అందించారు. డ్రైవర్ బన్సీలాల్‌ను ఆర్టీసీ డీఎం స్వామి, తోటి డ్రైవర్లు అభినందించారు.

30 సార్లు రక్తదానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు టి.వెంకటేశ్వర్లు ఆపదలో ఉన్న వారికి ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేసి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. స్థానిక ఓ ప్రైయివేట్ ఆస్పత్రిలో రక్తహీనతతో చికిత్స పొందుతున్న పి.వెంకటేశ్వరరావుకి మంగళవారం అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి వస్తే కుటుంబసభ్యులు మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ సంప్రదించారు. స్పందించిన ట్రస్ట్ సభ్యుడు వెంకటేశ్వర్లు వచ్చి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ వద్ద బీ పాజిటివ్‌ను 30వ సారి అందించాడు. బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం

అశ్వాపురం: గ్రామాలలో అభివృద్ధి గురించి కొందరు బీఆర్‌ఎస్ నాయకులు వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందని, ఆ మాటలు ప్రజలు నమ్మరని వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో మండలంలో కొన్ని గ్రామ పంచాయతీల్లో గోరంత పని చేసి కొండంత ప్రచారం చేసుకున్నారే తప్ప గ్రామాల్లో పెద్దగా అభివృద్ధి చేసింది లేదన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేని సమయంలో ఉపాధి హామీ పనులు పంచాయతీలకు అప్పగిస్తే అవకతవకలకు పాల్పడి వందలాది మస్టర్లు బీఆర్‌ఎస్ నాయకుల బంధువులకు వేసి జీపీ కార్యదర్శులను బలి పశువులను చేశారని విమర్శించారు.

దుమ్ము, ధూళిని నివారించాలి

మణుగూరురూరల్: కొండాపురం భూగర్భగని, నూతన ఓసి2 సైట్ ఆఫీస్ ప్రాంతాల్లో దుమ్ము, ధూళి నివారణకు, అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి టి.లక్ష్మీపతిగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచ్ కమిటీ ఇన్‌చార్జ్ నాగెల్లి మాట్లాడుతూ..చిరు వర్షానికే రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు నిలుస్తోందని, తద్వారా ఆ మార్గం గుండా విధులకు హాజరయ్యే ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా ముందస్తు వరద నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కార్మిక శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని గనులు, విభాగాల వద్ద దుమ్ము,ధూళి నివారణ కోసం యాజమాన్యం ట్యాంకర్లతో వాటర్ స్ప్రేయింగ్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలపై పీకేఓసీ పీఓ సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు రామాచారి, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ములకలపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆర్‌ఎంపీ ఇనుకుర్తి రామాచారికి సహమిత్రులు అండగా నిలిచారు. రూ.20 వేలు వితరణ అందజేసి, ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలపరిధిలోని జగన్నాథపురంలో నివసించే గ్రామీణ వైద్యుడు రామాచారి ఇటీవల బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాలి ఎముక విరిగిపోగా, ఖమ్మం ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేశారు, ఈ స్థానిక ఆర్‌ఎంపీ సంఘ మండలకమిటీ మంగళవారం రామాచారిని పరామర్శించారు. కుటుంబసభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండల అధ్యక్షుడు విశ్వాస్, కార్యదర్శి రఫీ, నాగరాజు, సత్యానారాయణ, రాంబాబు, కొమరయ్య, నవీన్, రమేశ్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి..

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట గ్రామానికి చెందిన ఊడల నరేష్ ఇటీవలే జరిగిన ప్రమాదంలో మరణించాడు. దీంతో కుటుంబీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విషయం తెలుసుకున్న మణుగూరు మున్నూరు కాపు సంక్షేమ సంఘం మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం నరేష్ దశదినకర్మల ఖర్చుల నిమిత్తం సంఘం ఆధ్వర్యంలో రూ.6వేలు, కానిస్టేబుల్ శ్రీను రూ.4వేలు మొత్తం రూ.10వేల ఆర్థిక సహాయాన్ని సంఘ అధ్యక్షుడు వన్నం కృష్ణమోహన్ అందజేశారు. సంఘం కార్యదర్శి గాండ్ల సురేష్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వెంకటరామారావు, తుపూడి శ్రీనివాస్, బత్తిని రామచందర్, పోట్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు అంబురాన్నంటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్

మణుగూరుటౌన్: జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు మణుగూరు ఏరియాలో ఘనంగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ జీఎం లక్ష్మీపతిగౌడ్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2వ తేదీన పీవీకాలనీలోని కమ్యూనిటీహాల్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం హనుమాన్ ఆలయం వరకు తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహించి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా భద్రాద్రి స్టేడియంలో సాయంత్రం 6గంటలకు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరయ్యే సింగరేణీయులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సేవా సమితి, స్థానిక మహిళలతో తెలంగాణ రుచులు, తినుబండారాలు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.టీ సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, శ్రీనివాసచారి, వెంకట్రావు, సలగల రమేష్, అనురాధా, మేరీకుమారి, మధుసూదన్‌రావు, శోభన్ బాబు, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం మెరుగు



దమ్మపేట: రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ అఫ్జల్ బేగం

దమ్మపేట: పంట సేద్యానికి ముందుగా పచ్చిరొట్టను భూమిలో కలిసేలా దున్నించడం వల్ల భూసారం పెరిగి పంటకు తగిన పోషకాలు అందుతాయని అశ్వారావుపేట డివిజన్ ఏడీఏ అఫ్జల్ బేగం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుంపెన కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో జీలుగులు, జనుములు పచ్చిరొట్ట వితనాలను సబ్సిడీపై, ఏడీఏ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో చల్లి, మొక్కలుగా పెరిగిన అనంతరం వాటిని భూమిలో కలియదున్నాలని సూచించారు. దీనివల్ల భూమి సారవంతముగా మారి, అధిక పంట దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. సొసైటీకి వచ్చిన విత్తనాల స్టాకు సరిపడక రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనికి స్పందనగా 500 క్వింటాల విత్తనాలు అవసరం ఉండగా, 250 క్వింటాల స్టాకు రాగా, అదనపు విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపామని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ అనూష, ఏఈఓ ప్రశాంత్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులకు సబ్సీడీ విత్తనాల పంపిణీని సోమవారం మండల వ్యవసాయశాఖాధికారి పి.శివరాంప్రసాద్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో జీనుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. పూర్తి ధర 2790లు కాగా, సబ్సిడీ రూ.1674లు పోను రైతు రూ.1116 చెల్లించి పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: ప్రభుత్వం అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకుని లాభపడాలని దుమ్ముగూడెం సొసైటీ అధ్యక్షుడు కిలిమి ఎల్లారెడ్డి కోరారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో సబ్సిడీపై జీలుగు విత్తనాలను రైతులకు అందచేశారు. 30 కేజీల బస్తా ధర రూ. 2790 కాగా రైతులకు సబ్సిడీపై రూ.1116కు లభిస్తుందన్నారు. జీలుగు విత్తనాల కోసం రైతులు ఆధార్‌కార్డు, పట్టదారు పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని రావాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కొడాలి లోకేష్, వర్షా రామకృష్ణ, జుంజురి నరసింహారావు, సంఘం సీఈఓ ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు సహకరించాలి



ఇంటి ఆవరణలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న డాక్టర్ రాందాస్ నాయక్

అశ్వారావుపేటరూరల్: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వినాయకపురం పీహెచ్‌సీ వైద్యాధికార్లు డాక్టర్ రాందాస్ నాయక్, డాక్టర్ కృష్ణదీపక్ రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని సుద్దగోతులగూడెం, తోగూడెం, కోర్సగూడెం, పాత మామిళ్లవారిగూడెం, ఆసుపాక, బోర్యాలగుట్ట, తిరుమలకుంట, దబ్బతోగు, నందిపాడు, కొత్త పేరాయిగూడెం, అశ్వారావుపేటలోని పేటమాలపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఇళ్లను సందర్శించి దోమల నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. అలాగే ఇళ్లలో ఉన్న పాత టైర్లు, వాడి పడేసిన ప్లాస్టిక్ డ్రమ్ములు,కుండలు, ఖాళీ కొబ్బరి బొండాలను గుర్తించి వాటిలో ఉన్న నిల్వ నీటిని పారబోశారు. కార్యక్రమాల్లో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, హెచ్ఈవో రాజు, హెచ్‌ఎస్ శ్రీను, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొడ్డు ధాన్యానికీ బోనస్ చెల్లించాలి

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం సన్న ఒడ్లు లావు ఒడ్లు అనే తేడా లేకుండా బోనస్ ప్రకటించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ములకపాడులో మర్మం చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సన్న వడ్లు, లావు వడ్లు అనే తేడా లేకుండా బోనస్ చెల్లించాలని అలాగే పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ నిధులు విడుదల చేయాలని, సమ్మర్ బోనస్ కింద ఎక్స్‌ట్రా నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యలమంచి శ్రీనుబాబు, సోయం వీర్రాజు, మోత్కూరు పున్నారావు, మీడియం జయ, సోషల్ మీడియా మండల కన్వీనర్ కుమ్మరికుంట సాంబశివరావు, కామయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలోని పాయం మంగయ్య గుంపు గ్రామానికి చెందిన ఆలం రాజు ఈ నెల 27న మణుగూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆలం రాజుకు మెరుగైన వైద్యం అందించేలా అధికారులతో మాట్లాడాలని కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి రమేష్‌బాబు, జిమ్మా జంపయ్యలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పాయం ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి రాజుకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. రాజు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కరకగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గుర్తింపు లేనటువంటి ప్రైవేటు పాఠశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేసారు.ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని తాటిగూడెం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకుండా ఇష్టం వచ్చినట్లుగా పాఠశాలలు నడుపుతూ నిబంధనలు ఉల్లంగిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలలో ఫీజులను నియంత్రించాలని, పుస్తకాలు, టై, బెల్టులు అమ్మే పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు జిమ్మిడి ప్రకాష్, నాయకులు జనగం సాంబశివరావు, రాజం రాకేష్, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వితరణ

చర్లరూరల్: ప్రముఖ రంగస్థల నటులు, రచయిత, దర్శకుడు బీవీ రావు జ్ఞాపకార్థం వారి కుమారులు బీవీ ప్రతాప్, బీవీ సంపత్, కుటుంబ సభ్యులు మంగళవారం స్థానిక గ్రంథాలయానికి వితరణ చేశారు. ఇక్కడకు వచ్చే పాఠకులు, విద్యార్థులకోసం సుమారు మూడువేల రూపాయల విలువ చేసే ఒక సీలింగ్ ఫ్యాన్, రెండు కుర్చీలను వితరణగా అందించారు. చర్ల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నీలి ప్రకాష్ చేతులమీదుగా గ్రంథ పాలకులు సిహెచ్.వంశీకృష్ణకు అందించారు. కార్యక్రమంలో కొత్తపల్లి రామాంజనేయులు, గాదె సుధాకర్, మాజీ ఉపసర్పంచ్ శిరిపురపు శివ,దొడ్డా ప్రభుదాస్, పొనగంటి కృష్ణ, బండి వేణు, పాశికంటి సంతోష్, రంగు నర్సింహామూర్తి, అంకాల శ్రీను, జగన్నాథం, దోమల శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను మంగళవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలతో నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కొన్ని చోట్ల పేదలకు పండ్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. తెలుగు చిత్ర పరిశ్రమలో విశ్వ విఖ్యాత నట సార్వభౌముడిగా వెలుగొందిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేశాడన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, అభిమానులు



దమ్మపేట: ఎన్టీఆర్ చిత్రపటం ఎదుట కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు



బూర్గంపాడు: ఎన్టీఆర్ జయంతి సందర్భంగా సారపాకలో నివాళులర్పిస్తున్న నాయకులు